# Eenadu

# పోలీసు నియామక ప్రక్రియలో సాంకేతిక విధానం

- ఎత్తు, బరువు, ఛాతీ కొలిచేందుకు డిజిటల్ పద్ధతులు

ఈనాడు - అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాల భర్తీకి పోలీసు నియామక మండలి నిర్వహించనున్న రాత, శారీరక దారుఢ్య, సామర్థ్య పరీక్షలు తొలిసారి పూర్తి సాంకేతిక విధానంలో జరగనున్నాయి. ఎంపిక ప్రక్రియలో అవకతవకలు, పొరపాట్లకు తావు లేకుండా చేయడం, మానవ ప్రమేయం (మాన్యువల్) తగ్గించే క్రమంలో ఈ మార్పులను తీసుకొచ్చారు. ప్రాథమిక రాత పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల నుంచి బయోమెట్రిక్ యంత్రాల ద్వారా వేలిముద్రలు తీసుకుంటారు. వీటితో పాటు వారి తాజా చిత్రాలను కూడా సేకరిస్తారు. ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించి, శారీరక దారుఢ్య, సామర్థ్య పరీక్షలకు ఎంపికయ్యే అభ్యర్థుల హాజరు వేలిముద్రల ద్వారానే తీసుకుంటారు. ఒకరి బదులు మరొకరు వీటికి హాజరయ్యేందుకు ఎలాంటి అవకాశం ఉండదు. శారీరక దారుఢ్య పరీక్షలకు సంబంధించి గతంలో ఓ చెక్క పరికరంపై అభ్యర్థిని నిలబెట్టి ఎత్తును కొలిచే వాళ్లు. ఇకపై ఆ విధానానికి స్వస్తి పలకనున్నారు. అభ్యర్థి ఎత్తు కొలిచేందుకు వినియోగించే పరికరంపైన అభ్యర్థి నిలబడినప్పుడు పాదం కింద, తలపైన సెన్సార్లను అమర్చుతారు. ఆ సెన్సార్లను కంప్యూటర్‌కు అనుసంధానించి డిజిటల్ పద్ధతిలో ఎత్తును కొలిచి నమోదు చేస్తారు. ఛాతిని కొలిచేందుకు డిజిటల్ టేపును వినియోగించి దాన్ని కంప్యూటర్‌కు అనుసంధానిస్తారు. బరువును డిజిటల్ కొలత పరికరాల ద్వారా చూస్తారు. వీటికి సంబంధించిన కొలతల వివరాలు ఎప్పటికప్పుడు పరీక్ష ప్రదేశంలో ఏర్పాటు చేసిన డిజిటల్ తెరలపై ప్రత్యక్షమవుతుంటాయి. దీని వల్ల తప్పులు నమోదు చేసేందుకు వీలుపడదు. ఇక పరుగు పందెంకు సంబంధించి ప్రస్తుతం మారథాన్‌ల్లో వినియోగిస్తున్న ఆర్‌ఎఫ్ఐడీ సాంకేతికతను వినియోగించనున్నారు. వీటికి సంబంధించిన చిప్‌లను పరుగులో పాల్గొనే అభ్యర్థులకు అమర్చుతారు. ప్రారంభ సమయం, నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకున్న సమయం వంటివి కంప్యూటర్‌లో నమోదవుతాయి. 1600 మీటర్ల పరుగును అభ్యర్థులు మొత్తం నాలుగు రౌండ్లలో పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆ లెక్కన ఏ రౌండు ఎంత సమయంలో పూర్తి చేశారన్నది కూడా దీని ద్వారా నమోదవుతుంది. గతంలో పరుగు పందెంను ఎంత సమయంలో పూర్తి చేశారనేది తెలుసుకునేందుకు స్టాప్‌వాచ్‌ను వినియోగించేవాళ్లు. ఇలా ఒక్కో బ్యాచ్‌లో వెయ్యి మంది అభ్యర్థులకు పరుగు పందెం నిర్వహిస్తారు.